ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ముందుంటా



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ ప్రజలు, అసోసియేషన్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఇటీవల జరిగిన ఎన్నికల్లో అఖండ మెజార్టీ అందించిన సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. మూడోసారి ఇంతటి భారీ మెజార్టీ అందించిన ప్రజలకు ఎప్పటికి రుణపడి ఉంటానన్నారు. పదేళ్ల నుంచి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల విషయంలో ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి వేసవి వచ్చిందంటే మంచి నీటి కొరత రాకుండా చూసుకున్నామన్నారు.

◆ పదేళ్ల కాలంలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నీటి కొరత లేకుండా, అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లానని గుర్తు చేశారు. అయినా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా నేను ముందు ఉంటానన్నారు. దేనికి వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. అవసరమైతే నిరాహారదీక్షకు సిద్ధమని తెలిపారు. ఇప్పటికే ప్రారంభించిన పనులు పెండింగ్‌లోకి వెళ్లిపోయాయని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించి పనులు పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎప్పుడు ఎటువంటి సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సంతోష్, మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు, బొట్టు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లిని కలిసిన తూము వినయ్‌కుమార్



కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావును కొంపల్లిలోని ఆయన కార్యాలయంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ వర్కింగ్ కమిటీ చైర్మన్ తూము వినయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ... నేషనల్ ఓబీసీ చైర్మన్ అజయ్‌సింగ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ వర్కింగ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినందుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, అవినాష్, నరసింహ చారి, మైసయ్య, యాకయ్య, బోనాల వెంకటేష్, బాబు, వెంకటేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో మారుతీనగర్

- కుక్కలు, మందుబాబులతో నిత్యం ఇబ్బందులు
- రోడ్లపై అక్రమ పార్కింగ్‌తో స్థానికులకు తప్పని తిప్పలు



మారుతీనగర్ ప్రధాన గేటు ఎదుట నిలిచిన మురుగు

మూసాపేట: మూసాపేట చౌరస్తాకు సమీపంలో ఉన్న ఆ కాలనీలో సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా తమ సమస్యలు పట్టించుకోవటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయని.. అక్రమ పార్కింగ్, తాగుబోతుల ఆగడాలతో వేగలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలనీ రోడ్లపై మురుగు చేరి దుర్వాసన వెదజల్లుతోంది.

కాలనీలో గ్రామ సింహాల బెడద...

కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. సుమారుగ 15 కుక్కలు కాలనీలో సంచరిస్తున్నాయి. ఈ చిన్న పిల్లలు స్కూల్‌కి వెళ్లేటప్పుడు, పెద్దలు కార్యాలయాలకు వెళ్లేటప్పుడు, మహిలలు మార్కెట్‌కు వెళ్లినప్పుడు కుక్కలు వెంబడిస్తున్నాయి. ఈ మధ్యనే ఒక చిన్నారి స్కూల్‌కు వెళ్లేటప్పుడు, ఒక సీనియర్ సిటిజన్‌ను కుక్కల గుంపు వెంబడించి దారుణంగా దాడి చేసి గాయాల పాలు చేసిందని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ ఇప్పటి వరకు దాదాపు 10 నుంచి 15 మందిని కరిచాయని వేసవి కాలంలో కుక్కలు ఎండ వేడికి ప్రజల పైన దాడి చేసే అవకాశం ఉందన్నారు. ఇక్కడి నుంచి కుక్కలను దూరంగా తరిమివేయాలని స్థానికులు కోరుతున్నారు. తమ ఇంటికి బంధువులు రావాలన్నా భయపడుతున్నారని అన్నారు.

మందుబాబుల ఆగడాలు...

◆ కాలనీ ప్రారంభంలో గేట్ వద్ద మందుబాబుల ఆగడాలు ఎక్కువగా అయ్యాయి. రాత్రి 10.30 గంటలు దాటిన తరువాత మందు తెచ్చుకుని గేట్ వద్ద తాగుతున్నారు. అంతేకాకుండా గంజాయి కూడా కొంతమంది తాగుతున్నారు అని స్థానికులు తెలిపారు. ఫంక్షన్స్‌కి వెళ్లి వచ్చేటప్పుడు ఇబ్బందిగా ఉందని, మహిళలు ఇంటికి రావాలంటే చాలా భయపడుతున్నారని వాపోతున్నారు. వాహనాలు గేట్ వద్ద అడ్డంగా నిలిపి కాలనీ వాసులు లోపలకు వెళ్లాలన్నా గొడవ పడాల్సి వస్తుంది. గత కొన్ని రోజుల క్రితం కాలనీ వ్యక్తికి మందుబాబులకు గొడవలు కూడా అయ్యాయని తెలిపారు. రాత్రి సమయంలో మందుబాబులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ పార్కింగ్‌తో ఇబ్బందులు...

◆ కాలనీ ప్రారంభంలో హోటల్స్, మందు షాపులు ఉన్నాయి. వాటి కోసం వచ్చే వారు రోడ్డుపై అక్రమ పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మందుబాబుల కోసం గేట్ మూసివేసిన బయటకు కూడా వెళ్లకుండా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అత్యవసర సమయంలో బయటకు వెళ్లాలంటే ఇది ఒక్కటే దారి ఉంది. వాహనాలు తీసి వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉందని వాపోతుఆన్నరు. పగలు కూడా పార్కింగ్‌లో వాహనాలు ఉంటాయి. హోటల్స్‌కు వచ్చే వారితో పాటు మందుబాబుల వాహనాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

కాలనీ రోడ్లపై అక్రమ పార్కింగ్





ఆలయ నిర్మాణ దాతలకు సన్మానం



రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావును కలిసిన ఆలయ సభ్యులు

కూకట్‌పల్లి: ఫతేనగర్ డివిజన్ ప్రభాకర్‌రెడ్డినగర్ వాసులు వివేకానందనగర్‌లో బీజేపీ రాష్ట కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయ పునర్ నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో ఆలయ నిర్మాణ నమూనాను పరిశీలించి, నిర్మాణ శైలి తదితర అంశాలపై చర్చించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందించటానికి ముందుకొన కపిల్‌గుప్తా దంపతులను శాలువాతో సత్కరించారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ బాకీ, దత్తు, సాగర్, రాంరెడ్డి, విష్ణు, శ్రీనివాస్, రాంచందర్, లింగం, గోపాలకృష్ణ, శివ, శేషగిరిచారి, శ్రీనివాస్, రాజుచారి, విజయభవాని, శిల్పికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగపర్చుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం పేర్కొన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లోని ఉమెన్స్ పార్కు ఆవరణలో పార్థివ్ లంగ్ కేర్ సెంటర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఎం.నాగరాజు ఆధ్వర్యంలో సుమారు 200 మంది వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సబిహా బేగం మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆస్పత్రులు సమాజహితం కోసం వైద్య సేవలు అందించాలని సూచించారు. అదే విధంగా సామాజిక సేవ చేసినప్పుడే ప్రజల ఆదరణ పొందుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెసర సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.సంజీవ్, ఆస్పత్రి మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చ శ్రీరామమూర్తి మృతి తీరని లోటు



సంతాప సభలో మాట్లాడుతున్న అంజిరెడ్డి, కుటుంబ సభ్యులు

మోతీనగర్: ఎంసీహెచ్ఎస్ సీనియర్ సభ్యుడు పుచ్చ శ్రీరామమూర్తి అకాల మరణం చెందారు. ఈ సందర్భంగా ఆదివారం సంతాప సభ మోతీనగర్ కమిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సభలు శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు, ఎంసీహెచ్ఎస్ మాజీ అధ్యక్షుడు హనుమాన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో పుచ్చ శ్రీరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మరణం మోతీనగర్ వాసులకు తీరనిలోటని మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు నల్లమాల్పు అంజిరెడ్డి అన్నారు. శ్రీరామమూర్తి పేరిట ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సిఎస్ఆర్ మూర్తి, రమేష్ అయ్యంగార్, బి. నాగేశ్వరరావు, కొల్లప్ప, జగన్నాథం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రి యలమర్తి అనురాధకు పురస్కారం



రచయిత్రి యలమర్తి అనురాధకు మెమెంటో అందజేస్తున్న వంగూరి చిట్టెన్‌రాజు

మోతీనగర్: కాకినాడలో వంగూరి చిట్టెన్ రాజు నిర్వహించిన అఖిల భారత తెలుగు సాహితీ సదస్సులో ప్రముఖ రచయిత్రి యలమర్తి అనురాధకు మెమెంటో బహూకరించారు. 'జీవితం ఏమిటి?' అనే నవలపై నిలివెత్తు నిత్య జీవన ప్రతిబింబం శీర్షికన పత్ర సమర్పణగా ఈ పురస్కారం లభించింది. ఈ వేదికపై వంగూరి చిట్టెన్ రాజు చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు.

అల్పాహారం, నిత్యావసరాల అందజేత



న్యాయశ్రీ ఫౌండేషన్ చిన్నారులకు అల్పాహారం, నిత్యావసరాలను అందజేస్తున్న ఏకాంత్ గౌడ్, విద్యాకల్పన

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఏకాంత్‌గౌడ్, వివేకానందనగర్ డివిజన్ ఆల్విన్‌కాలనీలోని న్యాయ ఫౌండేషన్ చిన్నారులకు ఆదివారం అల్పాహారం అందజేశారు. దీంతో పాటు రైస్ బ్యాగ్, కందిపప్పు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకురాలు విద్యకల్పన, తిరుపతిరెడ్డి, భానుయాదవ్, పల్నాటి అశోక్, జితేందర్, గణేష్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, మర్లశ్రీను, వినోద్, నాగరాజు, షాలిని తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శిల్ప ఎవెన్యూ కాలనీలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలం సమీపించినందున ఎక్కడికక్కడ మానవతా దృక్పథంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా మూగజీవాలు మంచి నీళ్ల కోసం అల్లాడిపోయే పరిస్థితి ఉండటంతో తమకు తోచిన విధంగా ఇంటి ముందు ఆవరణలో మంచినీరు ఏర్పాటు చేస్తే పక్షులు, ఇతర మూగజీవాలకు కూడా మేలు చేసిన వారమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, ఉదయ్, రాజేష్, గంగిరెడ్డి, వెంకట్, నారాయణరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు భగవంత్‌రెడ్డి రాజీనామా



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మందాపురం భగవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి ఆదివారం రాజీనామా చేశారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులకు తన రాజీనామా పత్రాలను పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్‌లో వివిధ హోదాల్లో పనిచేశానని తెలిపారు. ప్రస్తుతం బీఆర్ఎస్ కుంభకోణాలు, పార్టీలో జరుగుతున్న పరిణామాలను చూసి పార్టీకి రాజీనామా చేశానన్నారు.

ప్రత్యేక పూజలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశానని అంజయ్యనగర్ రిటైల్ కూరగాయల మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారాయణ అన్నారు. ప్రతినెల అమావాస్య రోజున కనకదుర్గమ్మ దేవాలయంలో అమ్మవారి హోమం నిర్వాహించి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం





వేడుకల్లో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, కుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలో ఎన్‌వైకే కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఆల్విన్‌కాలనీలోని జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది, ఆశావర్కర్లు, సమాజ సేవ చేస్తున్న మహిళలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలను గౌరవించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కుమార్‌యాదవ్‌ను అభినందిస్తున్నానని అన్నారు. చదువుకునే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. పిల్లలకు తగిన సమయం కేటాయించాలన్నారు. పిల్లల నడవడికను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించి, చెడు అలవాట్ల బారిన పడకుండా చూడాలన్నారు. సన్మార్గంలో నడిచే విధంగా క్రమ శిక్షణ నేర్పుతూ వారి భవిష్యత్‌కి పునాది వేయాలన్నారు.

◆ అడ్వకేట్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళ సాధించలేనిదంటూ ఏమి లేదన్నారు. మహిళా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. చట్ట సభల్లో 33 శాతం మహిళలకు అవకాశాన్ని కల్పించి మహిళల గౌరవాన్ని దేశ ప్రధాని నరేంద్ర మోదీ మరింత పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో బాలమిత్ర స్కూల్ కరస్పాండెంట్ ప్రత్యూష, సెన్సార్ బోర్డు సభ్యురాలు స్రవంతి, మహిళా నాయకురాళ్లు దాక్షాయిని, శ్యామల, స్రవంతి, జ్యోతి, అనూష, అనిత, మునిషా, సత్య, కమలాకర్‌రెడ్డి, ఆర్‌కే చారి, శ్రీకాంత్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మూసాపేట: మూసాపేటలోని బలగం కిచెన్ హోటల్‌లో ఆదివారం శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. మూసాపేటలో శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో 2013–14 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల చైర్మన్ గార్లపాటి సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంత చదివినా పదో తరగతి విద్యార్థుల స్నేహం జీవితాంతం ఉంటుందన్నారు. వారిని కలిసిన ప్రతిసారి మధురానుభూతిని కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ట్రస్మా ఎన్నికలు



జిల్లా ట్రస్మా ఎన్నికల్లో విజయం సాధించిన పలు పాఠశాలల కరస్పాండెంట్లు

ఆల్విన్‌కాలనీ: ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి పర్యవేక్షణలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ట్రస్మా ఎన్నికలు చైతన్య విద్యానికేతన్ హైస్కూలులో ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా పద్మశ్రీ హైస్కూల్ కరస్పాండెంట్ జేరిపోతుల నాగరాజు, వాసర విద్యాలయం హైస్కూల్ కరస్పాండెంట్ గుంజడి అశోక్ ప్రధాన కార్యదర్శిగా, విద్యాకిరణ్ మోడల్ స్కూల్ కందునూరి పరశురామ్‌గౌడ్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ట్రస్మా స్టేట్ చీఫ్ అడ్వయిజర్ యాదగిరి శేఖర్‌రావు, అబ్జర్వర్‌గా ఇన్నారెడ్డి వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 268 మంది పాఠశాలల కరస్పాండెంట్‌లు, అన్ని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు, రాష్ట్ర సీనియర్ నాయకులు నల్లా భాస్కర్‌రెడ్డి, భీష్మారెడ్డి, రామకృష్ణ, సురభి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి పన్నాల హరీష్‌రెడ్డి రాజీనామా

గోమాత సేవలో ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి



కూకట్‌పల్లి: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి తన రాజీనామా పత్రాన్ని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించారు. క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలగాలనే తీసుకున్న నిర్ణయం ప్రకారం జిల్లా పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద జిల్లాకు రెండు పర్యాయాలుగా అధ్యక్షుడిగా ఉండటానికి అవకాశమిచ్చిన పార్టీ పెద్దలందరికీ ఆయన లేఖలో ధన్యవాదాలు తెలిపారు. మూడు దశాబ్దాలుగా 1994 నుంచి 2025 వరకు అన్ని విధాల సహకరించిన శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో గోమాత సేవలో ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు లేఖలో ప్రస్తావించారు.

◆ టీఆర్ఎస్‌లో ఉండగానే ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఆయన టికెట్ రాకపోవటంతో బీఎస్పీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బీజేపీలో చేరిన ఆయన కొద్ది కాలంలోనే జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. రెండు పర్యాయాలు జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన హరీష్‌రెడ్డి ఇటీవల కాలంలో ఎంపీ టికెట్‌ను ఆశించారు. టికెట్ రాకపోవటంతో మనస్థాపానికి గురైన ఆయన కొద్ది రోజులుగా ప్రజలకు అందుబాటులో లేరు. క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవటానికి గల కారణాలను సమయం, సందర్భం వచ్చినప్పుడు తెలియజేస్తానని పేర్కొన్నారు.